

గ్రామకంఠం భూమికి ఎసరు..

- అభివృద్ధి పేరుతో 500 గజాలు విక్రయానికి..
- ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్న గ్రామ సర్పంచ్
- నిర్మాణం, ఇంటి నంబర్‌కు కార్యదర్శి ఓకే..
- ప్లాట్లకు 50 శాతం నగదు తీసుకున్న వైనం..
- భూమి అమ్మొద్దంటున్న లక్ష్మాపూర్ గ్రామస్తులు

శామీర్‌పేట్: కంచే చేను మేస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి లక్ష్మాపూర్ గ్రామ భూములది. అభివృద్ధి పేరుతో గ్రామకంఠం భూమిని అంగట్లో సరుకులా అమ్మేందుకు గ్రామ సర్పంచ్, కొందరు వార్డు సభ్యులు పన్నాగం పన్నుతున్నారు. ఇందుకు గ్రామ కార్యదర్శి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం, సీఎం దత్తత గ్రామమైన లక్ష్మాపూర్ గ్రామకంఠం భూమి విక్రయ తతంగంపై సాక్షి కథనం..

ఏడేళ్ల క్రితం నూతన మండలం..

సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో శామీర్‌పేట మండలం నుంచి కొన్ని గ్రామాలను విడదీసి, మూడుచింతలపల్లి కేంద్రంగా ఏడేళ్ల క్రితం నూతన మండలాన్ని ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో ఇక్కడి భూములకు రెక్కలొచ్చాయి. మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న లక్ష్మాపూర్ గ్రామంలోని భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇదే అదనుగా భావించిన స్థానిక సర్పంచ్, కొందరు వార్డుసభ్యులు కలిసి గ్రామ పరిధిలోని సర్వే నంబర్–165లోని సుమారు 500 గజాల గ్రామకంఠం భూమిపై కన్ను పడింది. ఈ స్థలాన్ని విక్రయించేందుకు గ్రామంలోని రామాలయం ఆలయాన్ని అభివృద్ధి చేద్దామంటూ సాకుగా చూపి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నాడు.

ప్లాట్ల అమ్మకానికి గ్రామస్తులు వ్యతిరేకం..

భూముల అమ్మకాన్ని గ్రామస్తులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. గ్రామకంఠం స్థలాన్ని అమ్ముకుంటూ పోతే భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, భవిష్యత్‌లో ఏవైనా ప్రజల అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను నిర్మించుకునేందుకు ఈ భూమిని విక్రయించవద్దని గ్రామస్తులు చెబుతున్నారు. మరోవైపు కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఈ స్థలాన్ని కేటాయించాలని గ్రామంలోని కుల సంఘాల పెద్దలు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధి సాకుతో..

లక్ష్మాపూర్ గ్రామంలోని సర్వే నంబర్–165లో ఉన్న 500 గజాల గ్రామ కంఠం భూమిని అమ్మి గ్రామ పరిధిలోని రామభద్రక్షేత్రం(రాములగుట్ట)ను అభివృద్ధి చేద్దామని సర్పంచ్ ఆంజనేయులు ప్రతిపాదన తెచ్చాడు. అన్నదే అదును సదరు భూమిని 5 ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టాడు. ప్లాట్లకు చెందిన 50 శాతం నగదు సర్పంచ్ ఆంజనేయులుకు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిర్మాణం, ఇంటి నంబర్‌కు రెడీ

లక్ష్మాపూర్ గ్రామకంఠం భూమిని కొనుగోలు చేసిన వారు సదరు స్థలంలో ఇంటి నిర్మాణాలు, ఇంటి నంబర్ ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శి ఓకే చెప్పినటు సమాచారం. నిర్మాణాల అనుమతికి సదరు పంచాయతీ కార్యదర్శికి సర్పంచ్ ఆంజనేయులు భారీగా ముడుపులు ముట్టజెప్పాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లక్ష్మాపూర్ భూబాగోతంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి భూములతో పాటు గ్రామంలో జరిగే అక్రమాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్పంచ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



చందాల ద్వారా ఆలయాన్ని అభివృద్ధి చేద్దామని చెప్పినా సర్పంచ్ ఆంజనేయులు వినకుండా గ్రామకంఠం స్థలాన్ని అమ్ముతున్నాడు. ఆలయ సాకు చూపెట్టి స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు, మా గ్రామ సర్పంచ్ ఆంజనేయులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు. ప్లాట్ల ద్వారా వచ్చిన నగదును రామాలయం ట్రస్టుకు చెందిన ఖాతాల్లో ఇంత వరకు జమచేయలేదు.

– సాయి శ్రీనివాస్‌చారి,
బీఆర్‌ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా...

శ్రీరంగవరంలో జీవవైవిధ్య రచ్చబండ



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ రఘు

మేడ్చల్: గ్రామాల్లో జీవవైవిధ్యం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రచ్చబండ కార్యక్రమాన్ని మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా జీవవైవిధ్యం కో ఆర్డినేటర్ రఘు అవగాహన కలిపించారు. జీవవైవిధ్యం పెంపొందించేందుకు చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయానంద్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ప్రకాష్, వార్డు సభ్యులు యాదయ్యగౌడ్, కృష్ణ, రవిచంద్ర, రాధ, సరిత, పద్మ, కార్యదర్శి వెంకటరమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ కెనాల్ నిర్మించాలని వినతి



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని అన్నరాయిని చెరువు నుంచి చర్లపల్లి చెరువు వరకు వరద నీటి సమస్య పరిష్కారానికి బాక్స్‌కెనాల్(నాలా) నిర్మించాలని శుక్రవారం నాగారం మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గూడురు సబితాఆంజనేయులుగౌడ్ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, గూడురు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ



మేడ్చల్: డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్మికులకు సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి రెయిన్ కోట్స్‌ను అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో వారికి అందజేశారు. ఉపసర్పంచ్ సత్యనారాయణ, నాయకులు అశోక్, శ్రీరాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

చెల్మారెడ్డికి నివాళి



మేడ్చల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తూర్పు జేఏసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన వెదిరే చెల్మారెడ్డి సేవలు మరువలేనివని నాటి ఉద్యమకారులు బీఆర్ఎస్ నాయకులు సంజీవరావు, వీరభద్రారెడ్డి అన్నారు. చెల్మారెడ్డి మృతి పట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. జిల్లాలో ఎన్నో ఉద్యమాలకు చెల్మారెడ్డి సారథ్యం వహించి తెలంగాణ రాష్ట్ర సాధనలో రంగారెడ్డి జిల్లా తరఫున కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు' స్థలాల సమస్యను పరిష్కరించాలి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సుమారు 10 వేల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టలేక, ఇళ్లు కట్టుకున్న వాళ్లు అత్యవసరాలకు విక్రయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న సర్వే నంబర్లను రెగ్యులరైజ్ చేయాలని వినతి పత్రంలో కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పద్మారెడ్డి వెల్లడించారు.

వెల్ స్పన్ సేవల విస్తరణ

సాక్షి సిటీబ్యూరో: నగరంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ వెల్‌స్పన్.. తమ సంస్థ సేవలను అంతర్జాతీయ స్థాయికి విస్తరించిన నేపథ్యంలో విస్తృత పోర్ట్‌ఫోలియో కలిగి ఉన్న తమ అంబ్రెల్లా బ్రాండ్‌కు వెల్‌స్పన్ వరల్డ్‌గా పేరు మార్చామని, డబుల్ టిక్ లోగోతో పాటు పేరులో మార్పు చేర్పులు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్రం పురస్కారాలు



సన్మాన గ్రహీతలతో అధికారులు

మేడ్చల్: ఉత్తమంగా విధులు నిర్వర్తించిన మేడ్చల్ డిపో ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ప్రగతి చక్రం పురస్కారాలను అందజేసింది. డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ సన్మానించారు. 17 మంది కార్మికులకు యాజమాన్యం తరఫున ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాలతో కార్మికులను ఆయన ఘనంగా సన్మానించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఏఈ జగదీష్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



మేనేజర్‌కు వినతి పత్రనం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: వర్షాల వల్ల బురదమయంగా మారిన మేడ్చల్ –గిర్మాపూర్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. మేడ్చల్‌లో రైల్వే బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు వర్షాలతో పూర్తిగా బురదమయంగా తయారైందని మట్టిపోసి రాకపోకలకు వీలుగా చేయాలని కోరారు. కార్యక్రమంలో గిర్మాపూర్ బీజేపీ నాయకులు రాఘవరెడ్డి, విష్ణుగౌడ్, నాగార్జున్‌రెడ్డి, గఫార్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



మేడ్చల్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్‌లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హేమలతారెడ్డి, జాకట ప్రేందాస్, సుధాకర్‌రెడ్డి, హరిబాబురెడ్డి, వంశీవంజరి, పద్మ, అరుణ, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మురుగు, వరదతో 22 కాలనీవాసులకు తిప్పలు

టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి



నాగారం వరద సమస్యపై కమిషనర్‌తో చర్చిస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని సుమారు 22 కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరద నీరు, మురుగు నీటి సమస్యకు ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగారం మున్సిపల్ కాంగ్రెస్ నేతలు, జేఏసీ నేతలతో కలిసి మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌ను కలిసి వరద నీరు, మురుగు నీటి వల్ల 22 కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీల్లో సరైనా మురుగునీటి వ్యవస్థ లేదని, దీనికి తోడు జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, దమ్మాయిగూడ మున్సిపాలిటీ తదితర ప్రాంతాల నుంచి మురుగు నీరంతా నాగారం మున్సిపల్ పరిధిలోకి వచ్చిచేరుతోందన్నారు. వర్షాలు వచ్చినప్పుడు మురుగునీరు, వరద నీరు లోతట్టు కాలనీల్లోకి చేరుతోందని, దీంతో కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకురాని పరిస్థితి నెలకొంటుందన్నారు. వరద నీటి కాలువను రాంపల్లి చౌరస్తా ప్రధాన రహదారి మీదుగా పెద్దకప్పు వరకు కేవలం 800 మీటర్ల మేర నాలా పనులు చేపడితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు, కొందరు తమ స్వార్థం కోసం కాలనీల మధ్య నుంచి నాలాను నిర్మించాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాలనీలవాసులు సమస్యపై పోరాటం చేసేందుకు జేఏసీగా ఏర్పడ్డారని, వారితో కలిసి వారం రోజుల క్రితం కలెక్టర్‌కు సమస్యను విన్నవించామన్నారు. కలెక్టర్ సూచన మేరకు కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పంగ హరిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పంగ ముత్యాలు, నేతలు పరమేష్, పంగ సంతోష్, జేఏసీ నేతలు జైకుమార్, కాలనీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యపై సీఎం కేసీఆర్‌ను కలుస్తాం

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వరద ముంపు కాలనీల్లో సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బాక్స్‌నాలాల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం మంత్రి మల్లారెడ్డి సహకారంతో త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తానని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. పలు వార్డుల్లోని లోతట్టు ప్రాంతాల్లో సమస్యలపై అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దమ్మాయిగూడ తదితర ప్రాంతాల నుంచి వరద నీరు రాంపల్లి చౌరస్తా ప్రధాన రహదారి మీదుగా నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో చేరి సుమారు 22 కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొదట వరద నీరు కాలనీల్లో నిల్వకుండా సాఫీగా వెళ్లే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. బాక్స్‌నాలా నిర్మాణానికి కౌన్సిలర్ల అభిప్రాయాలను తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు నుంచి డ్రైనేజీ వాటర్ రాకుండా త్వరలోనే కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించాలని నిర్ణయించారు. కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పాలకులకు పట్టవా..?

బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి



ముంపు కాలనీల్లో పర్యటిస్తున్న బీజేపీ నేతలు

కీసర: భారీ వర్షాలతో నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీలవాసులు ఇబ్బందులు పడుతుంటే పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టుకాలనీల్లో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, స్థానిక బీజేపీ నేతలతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి నాగారంలో వరద సమస్య ఉన్నా స్థానిక మున్సిపల్ చైర్మన్, మంత్రి మల్లారెడ్డి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం వరద నీరు, మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్, పాలకవర్గం స్పందించాలని కోరారు. నాగారం కౌన్సిలర్ లక్ష్మీవేణుగోపాల్, బీజేపీ నాగారం మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు బుద్ధవరం వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి గణపురం శ్యాంసుందర్‌శర్మ, ప్రధాన కార్యదర్శులు రామక్కపేట రవీందర్‌రెడ్డి, కొండబోయిన నాగరాజుయాదవ్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి నిలిచిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ బీజేఆర్‌నగర్‌కు చెందిన పెద్దోళ్ల లక్ష్మీకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్నతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామన్నారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్‌గౌడ్, సోమరాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేసిన శ్రీనివాస్

జవహర్‌నగర్ కార్పొరేషన్ మార్వాడిలైన్‌కు చెందిన మహేశ్వరికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీమన్, యాకచారి తదితరులు పాల్గొన్నారు.

యమ్నంపేట్‌కు చెందిన వ్యక్తికి..

పోచారం: యమ్నంపేట్‌కు చెందిన పత్యపు రమేష్‌కు రూ.41 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంత్రి మల్లారెడ్డి శుక్రవారం అందజేశారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, నాయకులు నర్రి కాశయ్య, రాజేష్, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

గంగమ్మకు పూజలు



డబీల్‌పూర్ చెరువులో గంగమ్మకు పూజలు చేస్తున్న నాయకులు

మేడ్చల్: భారీ వర్షాలతో చెరువులు నిండి అలుగులు పోస్తుండటంతో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు చెరువుల వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించారు. మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్, ఎల్లంపేట్, పూడూర్, రాయిలాపూర్, గౌడవెల్లి, అత్వెల్లి, గిర్మాపూర్ తదితర చెరువుల వద్ద సర్పంచ్‌లు గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు. చెరువుల వద్ద కుంకుమ, పసుపు కొబ్బరికాయలతో ప్రత్యేకంగా పూజలు చేసి మేకపిల్లను చెరువులో వదిలేసి గంగమ్మకు పూజలు చేశారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్‌లు బాబుయాదవ్, కవిత జీవన్, గీత భాగ్యారెడ్డి, సురేందర్‌ముదిరాజ్, నర్మదగోపాల్‌రెడ్డి, వెన్నెల రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు నేలమట్టం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వర్షాల కారణంగా కూలిన ఇళ్లు, శిథిలావస్థ చేరిన ఇళ్లను మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు. మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులోని శిథిల భవనాన్ని గురువారం స్థానిక కౌన్సిలర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జేసీబీతో తొలగించారు. సిబ్బంది రమేష్, ప్రభాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సున్నిత అంశాలను వైరల్ చేస్తే చర్యలు

శామీర్‌పేట్: సున్నిత అంశాలను వైరల్ చేస్తే చర్యలు తప్పవని శామీర్‌పేట సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్ని సంవత్సరాల క్రితం హిందూ దేవాలయంపై జరిగిన ఘటన వీడియోను ఇటీవల జరిగిన ఘటనగా వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేయడం సరికాదని అన్నారు. అంతేగాకుండా ఈ వీడియో కింద శామీర్‌పేటలో అని ట్యాగ్‌లైన్ పెట్టి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న నిందితులను అతి త్వరలోనే అరెస్టు చేస్తామని ఓ పత్రిక ప్రకటనలో ఆయన తెలిపారు.

వర్షం తగ్గినా.. ప్రవహిస్తున్న వాగులు



అలుగులు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు

మేడ్చల్: భారీ వర్షాలకు బ్రేక్ పడినా వరదలు జోరుగా వస్తుండటంతో వాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం వర్షం లేకపోవడంతో కాలనీల్లో చేరిన వరద నీరు వెళ్లిపోయింది. మున్సిపల్ సిబ్బంది శ్రమించి డ్రైనేజీలకు మరమ్మతులు చేశారు. మ్యాన్‌హోల్స్ ద్వారా వరద నీటిని పంపించారు. కానీ బురద మాత్రం మిగిలింది. గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రోడ్డులో రాయిలాపూర్ శివార్లలో, మేడ్చల్–గౌడవెల్లి రోడ్డులో గౌడవెల్లి సమీపంలో, మేడ్చల్–కిష్టాపూర్ రోడ్డులో వాగులు బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తున్నాయి.



మేడ్చల్ రాఘవేంద్రనగర్ కాలనీలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్ హరికృష్ణయాదవ్



కిష్టాపూర్‌కు వెళ్లే రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు